



అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేశ్

పార్టీలో యువతకు ప్రాధాన్యం

కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- 'ఎలమంచిలి' కేడర్‌తో సమావేశం





జనసంద్రంగా మారిన అచ్యుతాపురం జంక్షన్. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

అచ్యుతాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): "తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తాం. నేను ఇక్కడి వచ్చింది భరోసా ఇవ్వడానికి కాదు. సమస్యలను పరిష్కరించేందుకే వచ్చాను." అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.

సోమవారం అచ్యుతాపురంలోని జరిగిన తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ విధ్వంస పాలనపై అందరం కలసికట్టుగా పోరాడి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94 శాతం స్ట్రైక్ రేట్‌తో 164 సీట్లు సాధించామన్నారు. కోటి మంది సభ్యత్వాలతో టీడీపీ ఒక చరిత్ర సృష్టించిందని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం సుమారు రూ.140 కోట్లు ఖర్చుచేశామని, ప్రమాదబీమాను రూ.5 లక్షలకు పెంచామన్నారు. పార్టీలో యువతకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని, నాయకులు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని 'ఉత్తమ కార్యకర్త' పేరిట అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా మంత్రి వంగలపూడి అనిత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఏపీ రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ ఉత్తరాంధ్ర ... మిగతా 6వ పేజీలో

అభివృద్ధి, సంక్షేమం అజెండాతో ముందుకు..

- రెండు నెలల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ
- అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సహకరించాలి
- మంత్రి నారా లోకేశ్

రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందని ఐటీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గత పాలకులు ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా...తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. రూ.243 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి (14 కిలోమీటర్లు) విస్తరణ పనులకు సోమవారం ఆయన అచ్యుతాపురంలో శంకుస్థాపన చేశారు.

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో



అనకాపల్లిలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్



టీడీపీ ఎలమంచిలి కేడర్ సమన్వయ సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలుచల్లి నివాళులు అర్పిస్తున్న లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, పల్లా శ్రీనివాసరావు, ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు.

లోకేశ్‌కు బ్రహ్మరథం

- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అచ్యుతాపురం రాక
- ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు
- తొలుత 'ఎలమంచిలి' కేడర్‌తో సమావేశం
- నేతలకు దిశానిర్దేశం, ఉత్తమ కార్యకర్తలకు అవార్డులు
- అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు శ్రీకారం, బహిరంగ సభ
- జనంతో కిక్కిరిసిన నాలుగు రోడ్ల కూడలి

అచ్యుతాపురం/ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అచ్యుతాపురం వచ్చిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన విశాఖ నుంచి అనకాపల్లి జాతీయ రహదారి, మునగపాక మీదుగా సోమవారం మధ్యాహ్నం అచ్యుతాపురం జంక్షన్‌కు చేరుకున్నారు. ఇక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి, మేళతాళాలు, వివిధ రకాల కళాకారుల ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూడిమడక రోడ్డులో ప్రైవేటు కల్యాణమండపానికి చేరుకుని పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వారితో సమావేశమయ్యారు. వీరికి 'ఉత్తమ కార్యకర్త' పేరిట అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు లోకేశ్‌తో ఫొటోలు దిగారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో బయలుదేరి ఊరేగింపుగా రెండు కిలోమీటర్ల దూరంలోని అచ్యుతాపురం జంక్షన్‌కు చేరుకున్నారు. అప్పటికి రెండు గంటల ముందు నుంచే నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ... మిగతా 6వ పేజీలో

శ్లాబు పోయి రేకులొచ్చె..

- ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు వ్యయ అంచనాల్లో అధికారుల నిర్లక్ష్యం
- ప్రతిపాదనల ఆధారంగా నిధులిచ్చిన ప్రభుత్వం
- నిధులు చాలవన్న నెపంతో భవనం శ్లాబులు పడగొట్టి రేకుల షెడ్లు ఏర్పాటు
- ఎండవేడికి ఎలా తట్టుకుంటారని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

నర్సీపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖాధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారనుంది. ఎస్సీ వసతి గృహ భవనాల మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపిన అధికారులు తీరా నిధులు వచ్చిన తరువాత చాలవనే నెపంతో పనులను నామమాత్రంగా చేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వసతి గృహాల శ్లాబులను పడగొట్టి రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.





నర్సీపట్నంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు పడుకునే గదులకు రేకులు అమర్చిన దృశ్యం. (ఇన్‌సెట్‌లో) వసతి గృహంలో మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో 10 వసతి గృహాలు ఉన్నాయి. హాస్టల్ భవనాలకు సున్నాలు, కిటికీ రెక్కలు, తలుపులు, మరుగుదొడ్లు, శ్లాబ్ మరమ్మతులు, ఫ్యాన్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులకు అధికారులు రూ.1.34 కోట్లతో అంచనాలు తయారు చేశారు. దీని కోసం సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఈఈ, డీఈ, ఏఈలు ఒకటికి నాలుగు సార్లు వసతి గృహాలను సందర్శించి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తీరా పనులు మొదలు పెట్టిన తరువాత మరమ్మతులకు నిధులు సరిపోవడం లేదని ... మిగతా 6వ పేజీలో

చోడవరం ఏఎంసీ పీఠం ఎవరికో?

చైర్మన్ పదవి రేసులో పలువురు ఆశావహులు

- తమకు అవకాశం ఇవ్వాలని 'రోలుగుంట' నేతల వినతి
- చోడవరం మండలం నుంచి ఎమ్మెల్యే..
- బుచ్చెయ్యపేట నుంచి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్.
- రావికమతం మండలం నుంచి ఎమ్మెల్సీ..
- ఏ పదవీ లేని రోలుగుంటకు ఏఎంసీ చైర్మన్ కేటాయించాలని విన్నపం



చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

చోడవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు (ఏఎంసీ) చైర్మన్‌లను నియమించగా వాటిల్లో అనకాపల్లి జిల్లాలో ఎలమంచిలి, నర్సీపట్నం వున్నాయి. ఇంకా అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లను నియమించాల్సి వుంది. మలి విడతలో ఈ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తారన్న సమాచారంతో ఆయా నియోజకవర్గాల్లో ఈ పదవుల కోసం పలువురు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలో నాలుగు మండలాలు వుండగా, రోలుగుంట మినహా మిగిలిన మూడు మండలాల నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందువల్ల నియోజకవర్గస్థాయి పదవి అయిన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తమకు అవకాశం ఇవ్వాలని రోలుగుంట మండల నాయకులు కోరుతున్నారు.

ఐదేళ్ల క్రితం వరకు చోడవరం వ్యవసాయ మార్కెట్ పరిధిలో చోడవరం,మాడుగుల నియోజకవర్గాలు వుండేవి. గత వైసీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక మార్కెట్ కమిటీ ఉండాలన్న ఉద్దేశంతో 2020లో చోడవరం నుంచి మాడుగులను విడదీసి ప్రత్యేకంగా మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసింది. రెండు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్న సమయంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకంలో చోడవరం మండలం, లేదంటే మాడుగుల నియోజకవర్గం నేతలకే ప్రాధాన్యం లభించింది. వచ్చింది. టీడీపీ హయాంలో చోడవరం మండలానికి చెందిన పూతి కోటేశ్వరరావు, మజ్జి గౌరీశంకరరావు, వైసీపీ హయాంలో గూనూరు శంకరరావు, ఏడువాక సత్యారావు, దేవరాపల్లి మండలానికి చెందిన కిలపర్తి భాస్కరరావులకు పదవి లభించింది. ఈ నేపథ్యంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చోడవరం మండలానికి చెందిన వారు. బుచ్చెయ్యపేట మండలానికి చెందిన బత్తుల తాతయ్యబాబు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా వున్నారు. రావికమతం మండలానికి చెందిన వేపాడ చిరంజీవిరావు ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన రోలుగుంట మండలం నుంచి ఒక్కరు కూడా ఉన్నత పదవిలో లేరు. పదవుల పరంగా తమ మండలానికి సరైన ప్రాధాన్యం లభించడం లేదని టీడీపీకి చెందిన రోలుగుంట మండల నాయకులు మదనపడుతున్నారు. నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి మరొకటి ఇచ్చే అవకాశం లేదు. అందువల్ల ... మిగతా 6వ పేజీలో

భక్తి శ్రద్ధలతో రంజాన్



ఎలమంచిలిలో ఈద్‌గా వద్ద ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

జిల్లాలోని ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ (ఈద్-ఉల్-ఫిత్ర్) పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులు కఠోర నియమాలతో ఉపవాసాలు ఆచరించి, ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో సోమవారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, కశింకోట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, గొలుగొండ, మాకవరపాలెం, మాడుగుల, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లోని మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్‌లు రంజాన్ సందేశాన్ని వినిపించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సాగునీటి వనరులకు పూర్వ వైభవం

- శిథిలమైన మదుములు స్థానంలో కొత్తవి నిర్మాణం
- 500 ఎకరాలకు తీరనున్న నీటి సమస్య

పాయకరావుపేట రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వనరులకు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మోక్షం కలుగుతున్నది. మండలంలోని మంగవరం కాలువ పరిధిలో మంగవరం, గుంటపల్లి గ్రామాల వద్ద శిథిలమైన మదుముల స్థానంలో సుమారు రూ. 10 లక్షలు ఖర్చు చేసి నూతన మదుములు నిర్మించారు. దీంతో సుమారు 500 ఎకరాలకు నీటి సమస్య తీరుతుందని రైతులు సంతోషంతో చెబుతున్నారు.

మంగవరం కాలువ మంగవరం వద్ద మెరక కాలువ, పల్లం కాలువ, కొముదుల కాలువ, చెరువు కింద కాలువలుగా విడిపోయి పొలాలకు నీరు చేరుతుంది. అయితే చాలా ఏళ్ల నుంచి నాలుగు కాలువల మొగ మదుములు శిథిలస్థితికి చేరుకుని తలుపులు పాడైపోయి మెరక కాలువ, కొముదుల కాలువలోకి నీరు ప్రవహించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శిథిలస్థితిలో ఉన్న మదుముల స్థానంలో కొత్తవాటిని నిర్మించాలని వైసీపీ అధికారంలో వున్నప్పుడు రైతులు ప్రతి ఏటా విజ్ఞప్తి చేస్తూనే వున్నారు. కానీ ఒక్క ఏడాది కూడా నిధులు మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఆ వెంటనే సాగునీటి వనరులకు ... మిగతా 6వ పేజీలో



మంగవరం నాలుగు కాలువల మొగ వద్ద కొత్తగా నిర్మించిన మదుము



‘భవిష్యత్తుకు గ్యారెంటీ’ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన‘ఉత్తమ కార్యకర్త’లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్. వేదికపై మంత్రులు కొల్లు రవీంద్ర, వి.అనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పప్పల చలపతిరావు, దామచర్ల సత్య ఉన్నారు.



ఎలమంచిలి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేశ్. వేదిపై మంత్రులు కొల్లు రవీంద్ర, వి.అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు. హాజరైన నాయకులు, కార్యకర్తలు

నునపర్తిలో పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు ఎత్తివేయిస్తా

▸▸ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్

అచ్యుతాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం నునపర్తిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేతకు చర్యలు తీసుకుంటానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. సోమవారం ఇక్కడ జరిగిన కార్యకర్తల సమావేశంలో నునపర్తి కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ.. నునపర్తిలో గ్రామకంఠాన్ని బీజేపీ నాయకులు ఆక్రమించుకుంటే తాము అడ్డుకున్నామని, దీనిపై 27 మంది టీడీపీ కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన లోకేశ్ హోం మంత్రి వంగలపూడి అనితను వివరణ కోరారు. ఈ విషయం 20 రోజుల క్రితం తమ దృష్టికి వచ్చిందని, దీనిని పరిష్కరిస్తానన్నారు. వెంటనే తప్పుడు కేసులు ఎత్తివేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అలాగే ఇదే గ్రామంలో చాకిరేవు నిర్వహిస్తున్న స్థలాన్ని కూడా బీజేపీ నాయకులు అడ్డుపెడుతున్నారని తెలియజేయడంతో దీనిని వెంటనే పరిష్కరించాలంటూ జిల్లా మంత్రి కొల్లు రవీంద్రను మంత్రి లోకేశ్ సూచించారు. సెజ్‌లో 200 మందికి స్థలాలు మంజూరు చేయలేదని, పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ త్వరగా నిర్మించాలని, ఉపాధి హామీ, నీరు-చెట్టు బిల్లులు చెల్లించాలని ఫిర్యాదులు చేశారు. వీటిని త్వరితగతిన పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పార్టీకి సేవలు చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అచ్యుతాపురం మండలం ఎంజేపురానికి చెందిన పతివాడ చిన్నయ్య నాయుడు టీడీపీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రథమ స్థానం, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రెండో స్థానంలో ఉన్నందుకు రెండు ప్రశంసాపత్రాలను అందజేశారు. రాంబిల్లి మండలానికి చెందిన ఆదిరెడ్డి మూడుసార్లు ఉత్తమ అవార్డు అందుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



మంత్రి నారా లోకేశ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న లాలం భవానీ



అచ్యుతాపురం మండలం ఎంజేపురానికి చెందిన పతివాడ చిన్నంనాయుడికి అవార్డు ఇస్తున్న మంత్రి లోకేశ్

మాజీ ఎంపీపీ వినోద్‌రాజును పరామర్శించిన ఎంపీ కలిశెట్టి



పెదగుమ్ములూరులో వినోద్‌రాజుతో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎస్.రాయవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం రాత్రి మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు యేజెర్ల వినోద్‌రాజును పరామర్శించారు. నక్కపల్లి ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని తిరిగి వెళుతున్న ఎంపీ అప్పలనాయుడు తనకు ఎప్పటినుంచో పరిచయం ఉన్న మాజీ ఎంపీపీ వినోద్‌రాజుకు ఆరోగ్యం బాగోలేదని తెలియడంతో పెదగుమ్ములూరు వెళ్లి పరామర్శించారు. వినోద్‌రాజు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ పాల్గొన్నారు.

పాల్తేరులో సీతారాముల పెండ్లి రాట



పాల్తేరులో రామాలయం వద్ద పెండ్లి రాట వేస్తున్న మహిళలు

పాయకరావుపేట రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరులో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా రామాలయం వద్ద ఏప్రిల్ 6వ తేదీన జరిపే కల్యాణానికి సోమవారం పెండ్లిరాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు, మాధవి దంపతుల ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని, అనంతరం అన్నసమారాధన ఉంటుందని ఆలయ ధర్మకర్త దేవవరపు రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భజన గురువులకు ఘన సన్మానం



భజన గురువులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

నక్కపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపమాక రామాలయం వద్ద తృతీయ సప్తాహ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 30వ తేదీ నుంచి శ్రీనివాస భజన భక్త సమాజ ఆధ్వర్యంలో సప్తాహ కార్యక్రమం జరుగుతోంది. దీనిలో భాగంగా పలు గ్రామాలకు చెందిన భజన సమాజ గురువులు, హార్మోనిస్టులు, డోలక్ విద్వాంసులను ఉపమాక గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం అరట్లకోట, డొంకాడ, మంగవరం, మాసాహెబ్‌పేట, చినదొడ్డిగల్లు, ఉపమాక భజన సమాజాల గురువులు, ఇతర కళాకారులను దుశ్శాలువతో సత్కరించి, ఉపమాక వెంకన్న చిత్రపటాలను బహూకరించారు. ఈనెల 5వ తేదీ వరకూ నిరాటంకంగా తృతీయ సప్తాహ వేడుకలు జరుగుతాయి.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు

కోటవురట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతికి నిరసనగా సోమవారం క్రైస్తవ సంఘాల విశ్వాసులు మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. లింగాపురం జంక్షన్ నుంచి ర్యాలీగా వచ్చి కోటవురట్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. తిరిగి ర్యాలీగా కైలాసపట్నం జంక్షన్ చేరుకొని అక్కడ మానవహారం చేసి పాస్టర్ మృతికి సంతాపంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘాల కాపర్లు పీఆర్‌బాబు, కిశోర్‌కుమార్, ఎం.ఆశ్వరాధం, బిరాజు, ప్రసాద్, సంఘ పెద్దలు మట్ల ఆనందరాజ్, ఆర్. ప్రసన్నకుమార్, ఎం శ్యాంప్రసాద్, ఎం. సునాద్ బాబు, సాందీప్‌రాజ్ ఆర్‌నానిమణిమోహన్ పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్లు ప్రారంభం



దేవినగర్‌లో వేసిన సీసీ రోడ్డు

పాయకరావుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి హామీ పథకంతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు తెలిపారు. మండలంలోని అరట్లకోట గ్రామంలో రూ.20 లక్షలతో వేసిన సీసీ రోడ్డుతోపాటు పాయకరావుపేట పట్టణంలోని దేవినగర్‌లో రూ.30 లక్షలు, షీలానగర్‌లో రూ.20 లక్షలు, చెక్కానగర్‌లో రూ.10 లక్షలతో వేసిన సీసీ రోడ్లను మంత్రి వి.అనిత ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

లోకేశ్‌కు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో నాలుగు వైపులా రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. రహదారులకు ఇరువైపులా భవనాలపైనా జనం నిల్చున్నారు. లోకేశ్ రాగానే కార్యకర్తలు కేరింతలతో పెద్ద పెట్టున నినాదాలుచేశారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు లోకేశ్ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడే ప్రజల నుంచి ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్, మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, సీనియర్ నేతలు పప్పల చలపతిరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, లాలం భవానీ, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

శ్లాబు పోయి రేకులొచ్చె..

... 5వ పేజీ తరువాయి

కారణం చూపించి నర్సీపట్నం, గొలుగొండ బాలుర వసతి గృహాల శ్లాబులను పడగొట్టి వాటి స్థానంలో రేకుల షెడ్లు వేస్తున్నారు.

విడుదలైన నిధుల వివరాలు ఇవీ..

ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.34 కోట్లు విడుదల చేసింది. ఇందులో రావికమతం బాలికల వసతి గృహానికి రూ.12.5 లక్షలు, నర్సీపట్నం ఆనంద నిలయం(బాలురు) రూ.13 లక్షలు, నర్సీపట్నం బాలుర వసతి గృహం-2కి రూ.20 లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.12 లక్షలు, కళాశాల బాలికల వసతి గృహానికి రూ.3 లక్షలు, వేములపూడి బాలుర వసతి గృహానికి రూ.13 లక్షలు, నాతవరంలో బాలుర వసతి గృహానికి రూ.16 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ.16 లక్షలు, నాతవరం మండలం చమ్మచింత బాలుర వసతి గృహానికి రూ.12 లక్షలు, గొలుగొండ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి.

రేకుల షెడ్డులో బాలుర వసతి గృహాలు

నర్సీపట్నం, గొలుగొండ బాలుర వసతి గృహాల శ్లాబ్‌ల నుంచి నీరు కారుతుందన్న కారణంతో గోడలు ఉంచేసి మొత్తం శ్లాబ్‌లు పడగొట్టేశారు. కొత్త శ్లాబ్‌లు వేస్తారని అందరూ భావించారు. అయితే కాంట్రాక్టర్ నర్సీపట్నం బాలుర వసతి గృహాల శ్లాబ్‌లను పడగొట్టేసి రేకుల షెడ్లు వేశారు. గొలుగొండ బాలుర వసతి గృహానికి రేకుల షెడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందే..

వసతి గృహాలకు రేకుల షెడ్ల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఎండలు తీవ్రంగా కాసే సమయంలో ఉక్కపోతతో అల్లాడిపోతారని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరమ్మతులకు అంచనాలు తయారు చేయడంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడుతున్నారు. శ్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకొని ఉంటే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేటప్పుడు కొత్త శ్లాబ్ వేయాలని అందులో పేర్కొనవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పార్టీలో యువతకు ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

సమన్వయకర్త దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు అనకాపల్లిలో ఘన స్వాగతం

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు సోమవారం మధ్యాహ్నం అనకాపల్లిలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులకు విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా అచ్యుతాపురం వెళుతున్నట్టు తెలియడంతో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో జాతీయ రహదారిపై పూడిమడక జంక్షన్‌కు చేరుకున్నారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, నాయకులు కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, తదితరులు లోకేశ్‌కు స్వాగతం పలికారు. పీలా గోవింద నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. నూకాంబిక ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీనుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనం అందజేసి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కొత్త అమావాస్య జాతర నేపథ్యంలో ఆలయానికి వచ్చి నూకాంబిక అమ్మవారిని దర్శించుకోవాలని ఆహ్వానించారు. కశింకోటకు చెందిన తెలుగు మహిళ నాయకురాలు పెదపాటి కల్యాణి, లోకేశ్ నుదుటన కుంకుమ దిద్దారు. ఈ సందర్భంగా పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, గొల్లవిల్లి శ్రీను పాల్గొన్నారు.

సాగునీటి వనరులకు పూర్వ వైభవం

... 5వ పేజీ తరువాయి

మరమ్మతులు నిధులు కేటాయించింది. మంగవరం గ్రామం వద్ద మంగవరం కాలువపై శిథిల స్థితిలో ఉన్న నాలుగు కాలువల మొగ మదుమును తొలగించి సుమారు రూ.5 లక్షలతో, గుంటపల్లి వద్ద బాడవా కాలువపై ధ్వంసమైన మదుమును తొలగించి సుమారు రూ.5 లక్షలతో కొత్త మదుములు నిర్మించినట్టు మంగవరం కాలువ నీటి సంఘం అధ్యక్షుడు గూటూరు రామగోవిందు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



నక్కపల్లిలో రంజాన్ నమాజ్ చేస్తున్న ముస్లింలు



రాంబిల్లి: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎలమంచిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులుపాటు ఉపవాస దీక్షలు ఆచరించిన వారంతా పట్టణంలోని ఈద్గా వద్దకు చేరుకుని నమాజ్ చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు సోమవారం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేశారు. మండలంలోని ఎస్.రాయవరం, కొరుప్రోలు, చెల్లాపురం, కర్రివానిపాలెం గ్రామాల్లో గల మసీదుల్లో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులంతా ఒకరికినొకరు అలింగనం చేసుకొని, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని గోవింపాలెంలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఒక చోటకు చేరుకొని నమాజ్ చేశారు. ముస్లింల మత గురువు అన్వార్‌వలి మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ అని అన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేటలో రంజాన్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు స్థానిక మసీదుకు చేరుకుని మతపెద్దల ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. తమ స్థోమతకు తగినట్టుగా పేదలకు దానం చేశారు. అనంతరం బంధువులు, స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారు. కులమతాలకు అతీతంగా పట్టణంలో ముస్లింలు, హిందువులు పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.

నక్కపల్లిలో..

మండలంలోని పెదబోదిగల్లం, చినబోదిగల్లం, పెదదొడ్డిగల్లు, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట తదితర గ్రామాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, దర్గాల వద్ద రంజాన్ విశిష్టత గురించి ముస్లిం మత పెద్దలు వివరించారు. ఈ గ్రామాల్లో బావుటాలు ఎగురవేసి, ఊరేగింపు చేపట్టారు. నక్కపల్లి టీడీపీ కార్యాలయంలో పలువురు ముస్లింలకు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ రాష్ట్ర హోం మంత్రి తరపున రంజాన్ తోఫా సరుకులను పంపిణీ చేశారు.



ఎలమంచిలిలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

నేత్రపర్వంగా భావనారుషి, భద్రావతిల కల్యాణం



మునగపాక: భావనారుషి, భద్రావతిలపై వేస్తున్న కల్యాణ తలంబ్రాలు



రాంబిల్లి: భావనారుషిని దర్శించి పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ శివాలయంలో సోమవారం భావనారుషి, భద్రావతిల కల్యాణోత్సవం నేత్రానందంగా జరిగింది. గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకంగా రూపొందించిన మండపంలో అర్చకుడు రాంప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో భావనారుషి, భద్రావతిల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దొడ్డి సూర్యనారాయణ, త్రినాద్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని కొత్తపేటలో సోమవారం భద్రావతి సమేత భావనారుషి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణానికి స్థానికులే కాకుండా అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దంపతులకు పశుపు,కుంకుమ, మధుర ఫలాలు, పిండివంటలతో కూడిన సారెలను సమర్పించారు. తర్వాత సచ్చిదానందస్వామి వారిచే గోపూజను నిర్వహించారు. అనంతరం దంపతుల ఉత్సవమూర్తులను కొత్తపేట, చినకలవల్లాపల్లి, కొప్పగొండుపాలెం గ్రామాల్లో భజనలు, కోలాటాలు, చిడతలు, బ్యాండు తాళాలతో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట పద్మశాలి సంఘం, ఆలయ కమిటీ నిర్వాహకులు మాడెం రాజుబాబు, మాడెం నాగేశ్వరరావు, వానపల్లి అరుణ, జగన్నాథ్, తేలు వెంకటేశ్వరరావు, తెడ్లపు అప్పలకొండ, తేలు నరసింహమూర్తి, పుత్సా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఏఎంసీ పీఠం ఎవరికో?

... 5వ పేజీ తరువాయి

గౌరవప్రదమైన చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రోలుగుంట మండలానికి కేటాయించాలని పలువురు నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యేకి, పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీల పదవుల భర్తీకి త్వరలో రెండో విడత జాబితా విడుదల అవుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుండడంతో చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తమకే కేటాయిస్తారని రోలుగుంట నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తీర్థంలో రెండు గ్రూపుల మధ్య తగాదా

▸▸ చెదరగొట్టిన పోలీసులు

ఎలమంచిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆంజనేయస్వామి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ప్రధాన రోడ్డుపై స్టేజి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్టేజి కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు మధ్య గొడవ జరిగి చివరకు రెండు గ్రూపులు మధ్య కొట్లాడుకునే స్థాయికి చేరుకుంది. సమాచారం అందడంతో పట్టణ పోలీసులు చేరుకుని వారందరినీ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పట్టణంలో ఏ కార్యక్రమం జరిగినా స్టేజి కార్యక్రమాలు రోడ్డుపైనే నిర్వహిస్తుండడం ఆనవాయితీగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించేలా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



స్టేజి కార్యక్రమం వద్ద మోహరించిన పోలీసులు

ఉత్తమ ఉపాధ్యాయులకు ఉగాది పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో అసోసియేషన్ ప్రతినిధులు

తుమ్మపాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం ఉగాది పురస్కారాలను అందజేశారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు జెర్రిపోతుల రమణాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో తూర్పు కాపు, తెలగ కులస్థులు ఎక్కువ మంది ఉన్నప్పటికీ ఉన్నత విద్యనభ్యసించడంలో వెనుకబడి ఉన్నారన్నారు. వీరికి సంఘం ద్వారా ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు జి.శ్రీరామ్మూర్తి, శ్రీరామదాసు గోవింద, నాగేశ్వరరావు, నాయుడు, శ్రీనివాసరావు, రామకృష్ణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'మే 15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహా సభలు'

తుమ్మపాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన లోగోను సోమవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకి తీవ్రమవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేందుకు సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపు రాజు, వేముల కన్నబాబు, డొక్కరి హరీష్, బి.బాబ్జి, సంతోష్, విత్తనాల పోతురాజు, వి.సాయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 31వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు అధ్యక్షులు ఏఎస్‌రావు, జి.శంకరరావు, పి.సుధాకర్, రాజయ్య తదితరులు మాట్లాడుతూ అక్రమంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అధికారులు వేధింపులు ఆపాలన్నారు. ఈ దీక్షల్లో కేవీబీ లక్ష్మి, కేవీలక్ష్మి, పీజీ లక్ష్మి, కె.పద్మావతి కూర్చున్నారు.

విలువలతో కూడిన రాజకీయం 'కోడుగంటి' సొంతం

తుమ్మపాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నీతి, నిజాయితీతో పాటు విలువలతో కూడిన రాజకీయం దివంగత కోడుగంటి గోవిందరావుకే సొంతమని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం అన్నారు. గోవిందరావు జయంతి సందర్భంగా నెహ్రూచౌక్‌లో గల ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తిగా పేర్కొన్నారు. ఆయన ఆశయసాధనకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, నాయుడు, మల్లికార్జునరావు, కేవీ రమణ, షణ్ముఖసాయి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై
19న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో...ఏప్రిల్ 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ నిర్ణయించారు. దీంతో ఇరువర్గాల్లో ఉత్కంఠ మొదలైంది. అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన బలం సంపాదించుకునేందుకు కూటమి యత్నిస్తుంటే... తీర్మానం వీగిపోయేలా చేయాలని వైసీపీ ఆరాటపడుతోంది.

'గ్రేటర్' రికార్డు

▸▸ ఆస్తి పన్ను రూపేణా రూ.510 కోట్లు రాక

▸▸ జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూపేణా రూ.510 కోట్లు సమకూరింది. జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం. నగర పరిధిలో 5,89,994 ప్రైవేటు అసెస్‌మెంట్‌లు, 39,391 వీఎల్‌టీ అసెస్‌మెంట్‌లు, 1,630 రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అసెస్‌మెంట్‌లు, 524 కేంద్ర ప్రభుత్వ సంస్థల అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్లు ఆస్తి పన్ను వసూలైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా గత జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు యాక్షన్ ప్లాన్ తయారుచేశారు. వార్డు సచివాలయాల వారీగా ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల అసెస్‌మెంట్‌లను మ్యాపింగ్ చేయించారు. సచివాలయంలోని అడ్మిన్ సెక్రటరీలు తమ పరిధిలోని అసెస్‌మెంట్‌లకు వెళ్లి పన్ను బకాయిలు వసూలయ్యేలా చేయగలిగారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడం కూడా కలిసివచ్చింది. చాలామంది బకాయిదారులు పన్ను చెల్లింపునకు ముందుకువచ్చారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా రెండు నెలలుగాపైగా బాధ్యతలు నిర్వర్తిండడం కూడా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పన్ను బకాయిలు వసూలయ్యేందుకు దోహదపడింది. వీటన్నింటి కారణంగా ఈ ఏడాది రూ.510 కోట్లకుపైగా పన్ను వసూలైంది. రికార్డు స్థాయిలో పన్నులు వసూలుకావడం ఆనందంగా ఉందని, దీనికి జిల్లా కలెక్టర్, డీసీఆర్, జోనల్ కమిషనర్లతోపాటు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కృషి కారణమని అదనపు కమిషనర్ సోమన్నారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

లోకేశ్ పర్యటన దృశ్యమాలిక



జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు జీడిపప్పు మాల వేసి స్వాగతం పలుకుతున్న ప్రగడ నాగేశ్వరరావు, పక్కన మంత్రి లోకేశ్



ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేశ్





మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



రోడ్డు విస్తరణ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు





లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఆర్డీవో ఆయిషా



అనకాపల్లిలో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, సుందరపు విజయకుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



అనకాపల్లిలో శారదా నది ఒడ్డున ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కశింకోట నూరీ మసీదులో ..

అనకాపల్లి టౌన్/కశింకోట/పరవాడ/సబ్బవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలతా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన వీరంతా ఈ వేడుకలకు ఉత్సాహంగా హాజరయ్యారు. అనకాపల్లిలోని శారదా నది ఒడ్డున గల ఈద్గాలో పట్టణంలోని జామియా మసీదు అధ్యక్షులు పీఎస్ఎన్ హుస్సేన్ ఆధ్వర్యంలో అంతా కుటుంబ సభ్యులతో కలిసి అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే, మండల కేంద్రం కశింకోటలోని నూరీ మసీదు ఈద్గా మైదానంలో రం జాన్ వేడుకలను ముస్లింలతా ఘనంగా జరుపుకున్నారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.బాబర్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మన దేశంలో కులమతాలకు అతీతంగా అంతా ఈ రంజాన్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నూరి మసీద్ కమిటీ సభ్యులు రెహ్మాతుల్లా, ఎస్ఎంఎం అలీ, ఎంఏ రబ్బాని, ఐఎం షరీఫ్, ముస్తఫా, హాజీ హసన్ మాస్టర్ సాబ్, అబ్దుల్ రషీద్ ఖాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, చింతలపాలెంలో సయ్యద్ జాఫర్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇమామ్ మౌలానా మహ్మద్ గౌస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ముత్వల్లి, ఎస్.కె.బాబ్జి, రబ్బాని బాయ్, ఎస్.కె.ఇస్మాయిల్, ఎస్.కె.దర్గా సాయిబు, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పరవాడ మండలంలోని ముస్లింలంతా రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పవిత్రను మత గురువులు వివరించారు. పరవాడ, సింహాద్రి ఎన్టీపీసీ, రావాడ పంచాయతీ పరిధి గొల్లగొంట, వాడచీపురుపల్లి ప్రాంతాల్లో ముస్లింలంతా కలిసి ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో మత గురువులు నసీరుల్లా ఖాన్ (నున్నా) సుభాని, అన్సర్ అలీ, అబ్దుల్ రజాక్, ఫాజిల్ హుస్సేన్, అబ్దుల్ జలీల్, యాసిన్, ఖలీల్, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సబ్బవరం మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు.

దేవీపురంలో ఘనంగా
లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు



లలితాంబిక అమ్మవారు

సబ్బవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీ పురంలో గల సహస్రాక్షి అమ్మవారి పీఠంలో లలితాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఉద యం గోమాత పూజతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. లలితా సహస్రనామం, ఖడ్గమాల, త్రిశతి పారాయణం, మహాగణపతి, బాలా, లలితా హోమం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు కందర్ప రమా, ప్రభాకర్, మర్తి రాధ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

వెంకన్నకు రజిత పుష్పార్చన

పరవాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పంచాయతీ ఫార్మా పునరావాస కాలనీ కొండపై కొలువైన అభయ వేంకటేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధానార్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు నేతృత్వంలో రజిత పుష్పాలతో కలియుగ దైవానికి అర్చన జరిపారు. కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా భద్రావతి సమేత
భావనారుషి కల్యాణం

అనకాపల్లి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పాకగ్రామంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ వేడుకను కన్నులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద మృతి



గిడుతూరి వెంకటరమణ (ఫైల్)

సబ్బవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెక్కలిపాలెం గ్రామ సమీపంలో వున్న రైవాడ కాలువలో స్నానానికి ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరంలోని కైలాసపురం దరి కస్తూరినగర్‌లో నివాసం వుంటున్న చెందిన గిడుతూరి వెంకటరమణ (54) వాల్తేరు డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతని సొంతూరు టెక్కలిపాలెం. ఈ గ్రామంలో భూమి కొనుగోలు చేయాలని భావించాడు. భూ యజమానికి అడ్వాన్స్ ఇచ్చి, అగ్రిమెంట్ రాసుకోవడానికి ఆదివారం ఉదయం రూ.20 వేల నగదు పట్టుకుని స్నేహితుడు వాసపల్లి ఎల్లాజీతో కలిసి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై టెక్కలిపాలెం వచ్చాడు. అయితే భూ కొనుగోలుకు సంబంధించి తేడాలు రావడంతో అగ్రిమెంట్ చేసుకోలేదు. మధ్యాహ్నం మూడు గంటల సమ యంలో ఇద్దరూ కలిసి ఇక్కడి నుంచి బయ లుదేరారు. అయితే సాయంత్రం ఆరు గంటలకు టెక్కలిపాలెంలోని బంధువులు, వెంకటరమణ కుమారుడు లీలావంశీనాథ్‌కు ఫోన్ చేసి, మీ నాన్న రైవాడ కాలువలో స్నానానికి వెళ్లి మృతిచెందాడని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. లీలావంశీనాథ్ సోమవారం ఉదయం ఫిర్యాదు చేయడంతో సీఐ పిన్నింటి రమణ, సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వెంకటరమణకు భార్య సరోజిని, కుమారులు లీలావంశీనాథ్, నీరజ్ వున్నారు. కాగా ఎల్లాజీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

అమ్మవారి సన్నిధిలో సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. తొలుత వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం మునగపాకకు చెందిన కళాకారులు చేసిన కోలాటం, అన్నమాచార్య కీర్తనల ఆలాపన తదితరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



వేదికపై కోలాటం ఆడుతున్న కళాకారులు

'ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై విచారణకు ఉన్నత స్థాయి అధికారిని నియమించాలి'

కొత్తూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కశింకోట ఆర్ఈసీఎస్‌లో అవినీతి, అక్రమాలపై విచారణకు ఉన్నతస్థాయి అధికారిని నియమించాలని అనకాపల్లి జనసేన నేత చదరం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఈసీఎస్‌లో సెక్షన్ 51 ప్రకారం ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదులే కాకుండా కొత్తగా ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అన్నింటిపై లోతైన దర్యాప్తు చేసేందుకు విచారణ అధికారిగా తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ ఎండీ పి.వి.ఎస్.శాస్త్రిని నియమించారని వివరించారు. ఆర్ఈసీఎస్‌లో ప్రస్తుతమున్న అధికారులు శాస్త్రి కంటే పైస్థాయివారు కావడంతో సదరు అధికారి దర్యాప్తు ఏ విధంగా చేయగలుగుతారన్న అనుమా నాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆయన పదవీకాలం కేవలం నాలుగు నెలలు మాత్రమే ఉండడం వల్ల పూర్తి దర్యాప్తు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. ఏడాదికి రూ.వంద కోట్లు పైనే టర్నోవర్ ఉన్న ఈ సంస్థ ఆడిటర్ రిపోర్టును కూడా గోప్యంగా ఉంచి జరిగిన అవినీతి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

శారదా నదిలో
మునిగి యువకుడు మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నదిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందిన సంఘటనపై ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. విశాఖపట్నం తాటిచెట్లపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ (32) పెయింటింగ్ పనులు చేస్తుండేవాడన్నారు. ఏడాది క్రితం అనకాపల్లి వచ్చి పనులు చేసుకునేవాడన్నారు. ఆదివారం మధ్యాహ్నం నదిలోకి దిగిన సదరు యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్టు చెప్పారు. దీనిపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి విచారణ జరపగా, నది ఒడ్డున లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతని వివరాలు గుర్తించామన్నారు. మృతుడి సోదరి షేక్ జినిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

▸▸ క్రైస్తవ సంఘాల డిమాండ్ ▸▸ ప్రవీణ్ మృతిపై ఆందోళన



అనకాపల్లి మెయిన్ రోడ్డుపై ర్యాలీని నిర్వహిస్తున్న క్రైస్తవులు

తుమ్మపాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులపై మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడితే సహించేది లేదని క్రైస్తవ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల అను మానాస్పదంగా మృతిచెందిన ప్రవీణ్ పగడాల మృతిపై దర్యాప్తును ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టాలంటూ సోమవారం పట్టణంలోని క్రైస్తవ సంఘాలన్నీ కలిపి శాంతి ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల జిల్లా నాయకులు పండ్రాన తిమోతి మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిచెంది వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇందుకు సంబంధించిన వివరాలను పోలీస్ శాఖ స్పష్టం చేయకపోవడం దారుణమన్నారు. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రెవరెండ్ వినోద్ అబ్రహం మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ, సీఐడీలతో విచారణ చేపట్టి మృతికి గల కారణాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు బిషప్ క్రాంతిపాల్, జాషువా, కేపీడీఆర్ ప్రసాద్, ఏసురత్నం, సన్నీజేమ్స్, జయకుమార్, సీహెచ్. ప్రకాష్, జాన్సన్, జోసఫ్ తదితరులతో పాటు సీపీఎం నాయకులు శంకరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, అమ్ఆద్మీ నియోజకవర్గ ఇన్ చార్జి కొణతాల హరినాథబాబు, బీఎస్పీ నాయకులు సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో చిరు జల్లులు



సీలేరులో జల్లులు కురుస్తున్న దృశ్యం

సీలేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీలేరు పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సీలేరులో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం వాతావరణంలో మార్పులు వచ్చి చిరు జల్లులు కురిశాయి.

గాలిపాడు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలి



కాంక్రీట్ మిల్లర్‌ను లాక్కొని తీసుకు వెళ్తున్న గాలిపాడు గ్రామస్థులు

పాడేరురూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదాపల్లి పంచాయతీ గాలిపాడు పీవీటీజీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పాంగి నవీన్ కోరారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఏళ్ల తరబడి అధికారులకు వినతిపత్రాలను అందిస్తున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. రహదారి సౌకర్యం లేక పోవడంతో గ్రామంలో చేపడుతున్న గృహ నిర్మాణానికి వినియోగించే కాంక్రిట్ మిల్లర్‌ను సోమవారం గ్రామస్థులు అధ్వానంగా ఉన్న దారిలో లాక్కొంటూ తీసుకువెళుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వారపు సంతలో ఆశీలు వేలం పాట రేపు

కొయ్యూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డౌనూరు వారపు సంతలో ఆశీలు వసూలుకు రెండో తేదీన వేలం పాట నిర్వహించనున్నట్టు డౌనూరు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఉదయం 10 గంటలకు డౌనూరు పంచాయతీ కార్యాలయం వద్ద కొయ్యూరు పంచాయతీ విస్తరణాధికారి సమక్షంలో ఈ వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు రూ 50 వేలు సాల్వెన్సీతోపాటు రూ.20 వేలు అదనపు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని కార్యదర్శి తెలిపారు.

రిటైర్డు ఏఎస్ఐకు ఘన సన్మానం



ఏఎస్ఐ అర్జున్ దంపతులను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీరమణ చేసిన బి.అర్జున్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ దంపతులకు పోలీస్ సిబ్బంది శాలువా కప్పి సత్కారించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

పాడేరురూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ముస్లింలు రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జిక్రీ ఇలాహి జామా మసీద్‌లో గురువు ఎండీ ఆలీ ఆధ్వర్యంలో ముస్లింలు నమాజ్ చేశారు. ముస్లింలు నెల రోజులు ఉపవాసాలను ముగించుకొని రంజాన్ ఆఖరి రోజు సోమవారం నెలవంకను చూసి భారీ ర్యాలీగా వెళ్లి ఈదిక వద్ద నమాజ్ చేశారు. స్నేహితులు, బంధువులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు షేక్ అబ్దుల్లా, మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ సులేమాన్, షేక్ అన్సారీ, ఇమామ్, షేక్ మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్‌ను జరుపుకున్నారు. సోమవారం స్థానిక మసీద్ ఏ క్యూబాలో ముస్లింలు నమాజ్ చేశారు. మహిళలు ప్రత్యేకంగా నమాజ్ చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రంజాన్ ప్రాముఖ్యత, విశిష్టతను స్థానిక మత గురువు మహమ్మద్ సాహిద్ బోధించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్ బాయ్(అన్నవరం), కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి,



చింతపల్లిలోని మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



పాడేరు మసీద్‌లో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

సభ్యులు ఖాసింవలి, నూర్ సాహెబ్, షేక్ సత్తార్, వల్లి, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరులో సోమవారం ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులో ఉదయం తొమ్మిది గంటలకు నమాజ్ నిర్వహించారు. అనంతరం మసీద్ వద్ద ముస్లింలు పేదలకు ఆర్థిక సాయాన్ని అందిం చారు. అనంతరం మసీద్ నుంచి ర్యాలీగా ముస్లింల శ్మశానవాటిక వద్దకు వెళ్లి అక్కడ ప్రార్థనలను నిర్వహించారు.

కొయ్యూరులో..

మండలంలో ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాజేంద్రపాలెం బిలాల్ మసీద్‌లో ఖురాన్‌లో పేర్కొన్న నీతి సందేశాలను ముస్లిం సంఘ గౌరవాధ్యక్షుడు ఎస్‌కె బషీర్ ఖాన్ వినిపించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పీర్ అహ్మద్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

స్థానిక మసీదులో సోమవారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండ లంలోని పలు ప్రాంతాల వచ్చిన ముస్లింలు నమాజ్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం వక్ఫ్ ఆస్తుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు సుబేర్, మీరా, ముస్తఫా, ఎస్‌కే రెహ్మాన్, ఎస్‌కే అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఘాట్‌లో వృక్షాల తొలగింపు

▸▸ వంట్లమామిడి వద్ద భారీగా నిలిచిన వాహనాలు

పాడేరురూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్ మార్గంలో అప్రకటితంగా భారీ వృక్షాలను తొలగించడంతో కొన్ని గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని వంట్లమామిడి గ్రామసమీపంలో మెరుంబయలు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు వేసేందుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాలను విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సమయంలో కొట్టిన చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. వీటిని తొలగించేందుకు గంటల వ్యవధి పట్టడంతో భారీగా వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు స్పందించి చెట్ల తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి,



పాడేరు ఘాట్‌లో నిలిచిపోయిన వాహనాలు

ప్రవీణ్ మృతిపై క్రైస్తవుల శాంతి ర్యాలీ

చింతపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం లోతుగా విచారణ చేపట్టి వాస్తవాలను బహిర్గతం చేయాలంటూ క్రైస్తవులు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో పాడేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల పాస్టర్స్ ఫెలోషిప్, షారోన్ బృందం, యూసీడబ్ల్యూ ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. అనంతరం యూసీఐఎం చర్చీ ఆవరణలో క్రైస్తవులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం లోతుగా విచారణ చేపట్టి, హత్యగా నిరూపితమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు వసుపరి తిమోతి, సీనియర్ పాస్టర్ డేవిడ్ రాజ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, చింతపల్లి, కొయ్యూరు, జి.మాడుగుల, పాడేరు, పెదబయులు ఫెలోషిప్ అధ్యక్షులు కాలేబు, భూషణం, డేవిడ్, బాబూరావు, జోసప్, తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

శ్రీరామనవమి ఉత్సవాలకు ముహూర్తపు రాట



శ్రీరామనవమి ఉత్సవాలకు ముహూర్తపు రాటను వేస్తున్న దృశ్యం

సీలేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో రామాలయం వద్ద సోమవారం శ్రీరామనవమి ఉత్సవాల ముహూర్తపు రాటను వేశారు. ఈనెల 6వ తేదీన నిర్వహించే సీతారాముల కల్యాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పండితుడు రామశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ఐటీడీఏ ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి'

కొయ్యూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):ఐటీడీఏ ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని జీడిమామిడి రైతు సంక్షేమ సంఘం మండల కన్వీనర్ మాకాడ బూర్గులయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం జీడి పిక్కల సీజన్ ప్రారంభమైందని, వ్యాపారులు కుమ్మక్కు అయి, గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో జీడి పిక్కలకు మంచి ధర ఉన్నా.. వ్యాపారులు కేజీకి రూ. 90 నుంచి రూ.100 మధ్యలో కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఓలం మార్కెటింగ్ ప్రతినిధులతో ఐటీడీఏ సంప్రదించి కేజీ రూ 150 లు దాటి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాతృభాష ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జగన్



సీదరి జగన్

పాడేరురూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఆదివాసీ మాతృబాషా ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడుగా సీదరి జగన్‌ను నియమించామని సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్రి చిట్టిబాబు తెలిపారు. సోమవారం పాడేరులో నిర్వహించిన ఆదివాసీ మాతృబాషా ఉపాధ్యాయుల సంఘం జిల్లా సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. గతంలో జిల్లా సంఘం అధ్యక్షుడుగా పనిచేసిన ఎం.చిట్టిబాబు గత ఏడాది విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఎంపిక కావడంతో ఖాళీ ఏర్పడిం దన్నారు. జిల్లా అధ్యక్ష పదవికి జగన్‌ను ఎంపిక చేశామన్నారు.

ఉపాధి కూలీల పిల్లలకు ఉద్యోగ ఇంటర్వ్యూలు రేపు

కొయ్యూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి) ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీల పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు రెండో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో అప్పలరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఉపాధి పథకంలో 100 రోజులు పనిదినాలను పూర్తి చేసిన కూలీల పిల్లలు 10వ తరగతి ఆపై చదివిన వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జి.మాడుగుల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతబయలు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలం దౌడుపుట్టు గ్రామం నుంచి మండలంలోని ఆశ్రమాలకు కూరగాయాలను తీసుకు వెళుతున్న బొలేరో వాహనాన్ని సంతబయలు మలుపు వద్ద కుంబిడిసింగి పంచాయతీ గడ్డిరాయి గ్రామానికి చెందిన జగ్గందొర హరగోపాల్ ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరగోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడుని 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

శారదా నదిలో మునిగి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నదిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందిన సంఘటనపై ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. విశాఖపట్నం తాటిచెట్లపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ (32) పెయింటింగ్ పనులు చేస్తుండేవాడన్నారు. ఏడాది క్రితం అనకాపల్లి వచ్చి పనులు చేసుకునేవాడన్నారు. ఆదివారం మధ్యాహ్నం నదిలోకి దిగిన సదరు యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్టు చెప్పారు. దీనిపై అందిన సమాచారం మేరకు సిబ్బదితో వెళ్లి విచారణ జరపగా, నది ఒడ్డున లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతని వివరాలు గుర్తించామన్నారు. మృతుడి సోదరి షేక్ జీనిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పార్టీలో యువతకు ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

సమన్వయకర్త దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు అనకాపల్లిలో ఘన స్వాగతం

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సోమవారం మధ్యాహ్నం అనకాపల్లిలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులకు విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా అచ్యుతాపురం వెళుతున్నట్టు తెలియడంతో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో జాతీయ రహదారిపై పూడిమడక జంక్షన్‌కు చేరుకున్నారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, నాయకులు కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, తదితరులు లోకేశ్‌కు స్వాగతం పలికారు. పీలా గోవింద నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. నూకాంబిక ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీనుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనం అందజేసి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కొత్త అమావాస్య జాతర నేపథ్యంలో ఆలయానికి వచ్చి నూకాంబిక అమ్మవారిని దర్శించుకోవాలని ఆహ్వానించారు. కశింకోటకు చెందిన తెలుగు మహిళ నాయకురాలు పెదపాటి కల్యాణి, లోకేశ్ నుదుటన కుంకుమ దిద్దారు. ఈ సందర్భంగా పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, గొల్లవిల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద మృతి

సబ్బవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెక్కలిపాలెం గ్రామ సమీపంలో వున్న రైవాడ కాలువలో స్నానానికి ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరంలోని కైలాసపురం దరి కస్తూరినగర్‌లో నివాసం వుంటున్న చెందిన గిడుతూరి వెంకటరమణ (54) వాల్తేరు డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతని సొంతూరు టెక్కలిపాలెం. ఈ గ్రామంలో భూమి కొనుగోలు చేయాలని భావించాడు. భూ యజమానికి అడ్వాన్స్ ఇచ్చి, అగ్రిమెంట్ రాసుకోవడానికి ఆదివారం ఉదయం రూ.20 వేల నగదు పట్టుకుని స్నేహితుడు వాసపల్లి ఎల్లాజీతో కలిసి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై టెక్కలిపాలెం వచ్చాడు. అయితే భూ కొనుగోలుకు సంబంధించి తేడాలు రావడంతో అగ్రిమెంట్ చేసుకోలేదు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇద్దరూ కలిసి ఇక్కడి నుంచి బయ లుదేరారు. అయితే సాయంత్రం ఆరు గంటలకు టెక్కలిపాలెంలోని బంధువులు, వెంకటరమణ కుమారుడు లీలావంశీనాథ్‌కు ఫోన్ చేసి, మీ నాన్న రైవాడ కాలువలో స్నానానికి వెళ్లి మృతిచెందాడని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. లీలావంశీనాథ్ సోమవారం ఉదయం ఫిర్యాదు చేయడంతో సీఐ పిన్నింటి రమణ, సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వెంకట రమణకు భార్య సరోజని, కుమారులు లీలావంశీ నాథ్, నీరజ్ వున్నారు. ఎల్లాజీని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



గిడుతూరి వెంకటరమణ (ఫైల్)

లోకేశ్‌కు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో నాలుగు వైపులా రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. రహదారులకు ఇరువైపులా భవనాలపైనా జనం నిల్చున్నారు. లోకేశ్ రాగానే కార్యకర్తలు కేరింతలతో పెద్ద పెట్టున నినాదాలుచేశారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు లోకేశ్ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడే ప్రజల నుంచి ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్, మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, సీనియర్ నేతలు పప్పల చలపతిరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, లాలం భవానీ, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఏఎంసీ పీఠం ఎవరికో?

... 5వ పేజీ తరువాయి

గౌరవ ప్రదమైన చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రోలుగుంట మండలానికి కేటాయించాలని పలువురు నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యేకి, పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీల పదవుల భర్తీకి త్వరలో రెండో విడత జాబితా విడుదల అవుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుండడంతో చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తమకే కేటాయిస్తారని రోలుగుంట నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి వనరులకు పూర్వ వైభవం

... 5వ పేజీ తరువాయి

మరమ్మతులు నిధులు కేటాయించింది. మంగవరం గ్రామం వద్ద మంగవరం కాలువపై శిథిల స్థితిలో ఉన్న నాలుగు కాలువల మొగ మదుమును తొలగించి సుమారు రూ.5 లక్షలతో, గుంటపల్లి వద్ద బాడవా కాలువపై ధ్వంసమైన మదుమును తొలగించి సుమారు రూ.5 లక్షలతో కొత్త మదుములు నిర్మించినట్టు మంగవరం కాలువ నీటి సంఘం అధ్యక్షుడు గూటూరు రామగోవిందు తెలిపారు.

'ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై విచారణకు ఉన్నతాధికారిని నియమించాలి'

అనకాపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కశింకోట ఆర్ఈసీఎస్‌లో అవినీతి, అక్రమాలపై విచారణకు ఉన్నతస్థాయి అధికారిని నియమించాలని అనకాపల్లి జనసేన నేత చదరం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఈసీఎస్‌లో సెక్షన్ 51 ప్రకారం ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదులే కాకుండా కొత్తగా ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అన్నింటిపై లోతైన దర్యాప్తు చేసేందుకు విచారణ అధికారిగా తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ ఎండీ పి.వి.ఎస్.శాస్త్రిని నియమించారని వివరించారు. ఆర్ఈసీఎస్‌లో ప్రస్తుతమున్న అధికారులు శాస్త్రి కంటే పైస్థాయివారు కావడంతో సదరు అధికారి దర్యాప్తు ఏ విధంగా చేయగలుగుతారన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆయన పదవీకాలం కేవలం నాలుగు నెలలు మాత్రమే ఉండడం వల్ల పూర్తి దర్యాప్తు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. ఏడాదికి రూ.వంద కోట్లు పైనే టర్నోవర్ ఉన్న ఈ సంస్థ ఆడిటర్ రిపోర్టును కూడా గోప్యంగా ఉంచి జరిగిన అవినీతి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

'మే 15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహా సభలు'

తుమ్మపాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నట్టు సీపీఐ జిల్లా కార్య దర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన లోగోను సోమవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకి తీవ్రమవుతోందన్నారు. పాలకులు హామీలకే పరిమితం తప్ప, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఏ మాత్రం కృషి చేయడం లేదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపు రాజు, వేముల కన్నబాబు, డొక్కరి హరీష్, బి.బాబ్జి, సంతోష్, విత్తనాల పోతురాజు, వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఉగాది పురస్కారాలు

అనకాపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం ఉగాది పురస్కారాలను అందజేశారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు జెర్రిపోతుల రమణాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో తూర్పు కాపు, తెలగ కులస్థులు ఎక్కువ మంది ఉన్నప్పటికీ ఉన్నత విద్యనభ్యసించడంలో వెనుకబడి ఉన్నారన్నారు. వీరికి సంఘం ద్వారా ప్రోత్సాహం అందించాల్సిన అవస రం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సైతం ఉన్నత విద్య నందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జి.శ్రీరామ్మూర్తి, శ్రీరామదాసు గోవింద, నాగేశ్వరరావు, నాయుడు, శ్రీనివాసరావు, రామకృష్ణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్లాబు పోయి రేకులొచ్చె..

... 5వ పేజీ తరువాయి

కారణం చూపించి నర్సీపట్నం, గొలుగొండ బాలుర వసతి గృహాల శ్లాబులను పడగొట్టి వాటి స్థానంలో రేకుల షెడ్లు వేస్తున్నారు.

విడుదలైన నిధుల వివరాలు ఇవీ..

ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.34 కోట్లు విడుదల చేసింది. ఇందులో రావికమతం బాలికల వసతి గృహానికి రూ.12.5 లక్షలు, నర్సీపట్నం ఆనంద నిలయం(బాలురు) రూ.13 లక్షలు, నర్సీపట్నం బాలుర వసతి గృహం-2కి రూ.20 లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.12 లక్షలు, కళాశాల బాలికల వసతి గృహానికి రూ.3 లక్షలు, వేములపూడి బాలుర వసతి గృహానికి రూ.13 లక్షలు, నాతవరంలో బాలుర వసతి గృహానికి రూ.16 లక్షలు, బాలికల వసతి గృహానికి రూ.16 లక్షలు, నాతవరం మండలం చమ్మచింత బాలుర వసతి గృహానికి రూ.12 లక్షలు, గొలుగొండ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి.

రేకుల షెడ్డులో బాలుర వసతి గృహాలు

నర్సీపట్నం, గొలుగొండ బాలుర వసతి గృహాల శ్లాబ్‌ల నుంచి నీరు కారుతుందన్న కారణంతో గోడలు ఉంచేసి మొత్తం శ్లాబ్‌లు పడగొట్టేశారు. కొత్త శ్లాబ్‌లు వేస్తారని అందరూ భావించారు. అయితే కాంట్రాక్టర్ నర్సీపట్నం బాలుర వసతి గృహాల శ్లాబ్‌లను పడగొట్టేసి రేకుల షెడ్లు వేశారు. గొలుగొండ బాలుర వసతి గృహానికి రేకుల షెడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందే..

వసతి గృహాలకు రేకుల షెడ్ల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఎండలు తీవ్రంగా కాసే సమయంలో ఉక్కపోతతో అల్లాడిపోతారని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరమ్మతులకు అంచనాలు తయారు చేయడంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడుతున్నారు. శ్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకొని ఉంటే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేటప్పుడు కొత్త శ్లాబ్ వేయాలని అందులో పేర్కొనవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు శేషుకుమార్ గురించి వివరిస్తున్న విజయ్

శేషుకుమార్ కుటుంబాన్ని ఆదుకుంటాం

▸▸ రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్

మాకవరపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు రుత్తల శేషుకుమార్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. సోమవారం ఎలమంచిలి వచ్చిన మంత్రి లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కలిసి శేషుకుమార్ గురించి వివరించారు. దీంతో లోకేశ్ స్పందిస్తూ శేషుకుమార్ మృతి బాధాకరమని, వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే పార్టీ కూడా వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ దన్నుగా ఉంటుందని విజయ్‌తో లోకేశ్ చెప్పారు.

తెలుగు భాషా ఔన్నత్యాన్ని పెంపొందించాలి

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

చోడవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తెలుగు భాషా ఔన్నత్యాన్ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కోరారు. ప్రేమ సమాజం ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్యాన్స్‌బేబీల సంస్కృతి మారాలని చెప్పారు. యువతరంలో మార్పు రావాలని, తెలుగు భాషా ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం కళాకారులను ఎమ్మెల్యే రాజు సత్కరించారు. ఏడమ్స్ వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు సంప్రదాయ వస్త్రధారణ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, అటవీ రేంజి అధికారి బి.రాంనరేశ్, ప్రేమ సమాజం రాజు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే పంచాయతీలకు గుర్తింపు

▸▸ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు



జనసేనలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న పంచకర్ల, జనసేన నేత రాజు

చోడవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలోనే పంచాయతీలకు గుర్తింపు లభించిందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. మండలంలో వైసీపీకి చెందిన నాయకుడు జుత్తాడ సర్పంచ్ దొడ్డి ప్రసాద్, అతని అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి, నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో సోమవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే సర్పంచులకు గౌరవం కూడా పెరిగిందన్నారు. పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పవన్ కల్యాణ్ పారదర్శక విధానాలకు ప్రజాప్రతినిధులు ఆకర్షితులవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. వైసీపీ నాయకులు కర్రి రామకృష్ణ, దొడ్డి రామారావు, బొడ్డేడ నాయుడు, దొడ్డి జస్వంత్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రామప్పారావు, శ్రీను, మహేష్, సరోజ, మాలినాయుడు, శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో దాహం కేకలు



కొత్తూరులో కొళాయి వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ శివారు కొత్తూరు, కేటీ.పాలెం గ్రామాలకు నెల రోజులుగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగునీటి సదుపాయం లేక తీవ్ర తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కొళాయిల వద్ద నిరసన తెలిపారు. రెండు గ్రామాల్లో సుమారు 20 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, ఆయా గ్రామాల కొళాయిలకు సరఫరా చేసే పైపులైను నుంచి నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. వేరొకరి పామాయిల్ తోటలో బోరు నీరు వదిలనప్పుడు తెచ్చుకుంటున్నామన్నారు. వేసవి కావడంతో నీటి కోసం నెల రోజులకుపైగా ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చింతపండుకు పెరిగిన గిరాకీ

▸▸ కావిడికు రూ.2.500కు పైనే పలికిన ధర



మండుటెండలో చింతపండుతో రైతులు

మాడుగుల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో సోమవారం చింతపండు ధర గిరాకీ లభించింది. పాడేరు మండలంలోని కిక్కి, వంట్లమామిడి, ఈదుల పాలెం, పులుసుమా మిడి, కందుల పాలెం, సలుగు దేవాపురం, వంట్లమామిడి తదితర గిరిజన గ్రామాల నుంచి ఇక్కడ సంతలో విక్రయించేందుకు చింతపండు తీసుకువచ్చారు. సుమారు 30 కిలోల బరువుగల కావిడి చింతపండు రూ.2500 నుంచి పండు సైజుని బట్టి రూ.3 వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

▸▸ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో మసీదుల్లో ప్రార్థలు చేశారు. అలాగే ఒకరికొకరు ఆలింగం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



నర్సీపట్నంలో మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నర్సీపట్నం/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం/నాతవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో రంజాన్ ఉపవాసాలను ఆచరించి సోమవారం రంజాన్‌ను ఘనంగా చేసుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కొత్త దుస్తులు ధరించి మసీదుల్లో ప్రార్థనలు చేశారు. స్థానిక జామియా మసీద్‌లో వందలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు దానధర్మాలు చేశారు. ఈ కార్యక్రమంలో జామీయా మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో సోమవారం మసీదులో రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్ద ఎండీ కరీముల్లా రంజాన్ ఆయల విశిష్ఠతనులు వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాకవరపాలె: మండల కేంద్రంలో సోమవారం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఒకరొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి రంజాన్ విశిష్టను తెలిపారు.

నాతవరం: మండలంలోని వైబీ పట్నం గ్రామంలో ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో రంజాన్ జరుపుకున్నారు. ఒక్కరినొరరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకల్లో మజీద్ కమిటీ అధ్యక్షులు నాగూర్‌మేరా, కార్యదర్శి జిలాని గ్రామంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/బుచ్చెయ్యపేట:/రోలుగుంట: చోడవరం మండలంలోని సోమవారం ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం, వెంకన్నపాలెం, లక్కవరం మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెంకన్నపాలెం జుమ్మా మసీదులో అధ్యక్షుడు రహిమాన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ బాబ్జి, కరీం, జిలానీ గౌస్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చోడవరంలోని వెంకన్నపాలెంలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

రోలుగుంట: మండల కేంద్రంలోని మసీదులో రంజాన్ వేడుకులను నిర్వహించారు. ప్రతీ ఏడాది హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకుని మతసామరస్యాన్ని చాటుకుంటారు. మతపెద్దలు ఇమామ్, సతార్, సలీం, హుస్సెన్, మస్తాన్‌లు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శారదనది సమీపంలోని మసీదుకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు తరలివచ్చి నమాజ్ చేశారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని అల్లాకు ప్రార్థనలు చేశారు. విశాఖ నుంచి వచ్చిన మతగురువు షేక్ నజార్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఈద్‌ముబారక్ నమాజ్ చేశారు.

మాడుగుల నియోజకవర్గంలో...



మాడుగులలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

మాడుగుల/దేవరాపల్లి: మాడుగులలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు హత్తుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఖాలేశావల్లీ, షేక్ సులేమన్, ఇస్మాయిల్, వల్లీ, నజీర్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం, చంద్రయ్యపేటలో మసీదులో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అందరూ కలసి నమాజ్‌లో పాల్గొన్నారు. ఖురాన్‌లో పవిత్రమైన వ్యాఖ్యలను మత గురువు వినిపించారు. నెల రోజుల పాటు చేసిన కఠోర దీక్షను సోమవారంతో విరమించుకున్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



పైపులైన్ మరమ్మతు చేయిస్తున్న ఈవో

మాకవరపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తవీధిలో తాగునీటి పైపులైన్‌కు సోమవారం మరమ్మతులు చేపడుతున్నారు. కొత్తవీధిలో వారం రోజులుగా తాగునీరు రావడం లేదని 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురించిన కథనానికి పంచాయతీ ఈవో బాలదొర స్పందించారు. ఈ మేరకు రోడ్డుకు అనుకొని ఉన్న మురుగు కాలువులు తవ్వినప్పుడు దెబ్బతిన్న పైపులైన్లు తవ్వి బయటకు తీసి మరమ్మతులు చేస్తున్నారు. పగలిపోయిన చోట కొత్త పైపులైన్లు వేస్తున్నారు. బుధవారం నాటికి పూర్తి స్థాయిలో ప్రజలకు తాగునీరు అందిస్తామని ఈ సందర్భంగా ఈవో బాలదొర తెలిపారు.

పెదజగ్గంపేట శ్మశానవాటిన రోడ్డు పూర్తి

నాతవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదజగ్గంపేట గ్రామంలో శ్మశానవాటిక రహదారి నిర్మానం పూర్తయింది. గతంలో వర్షాకాల సమయాల్లో ఈ రోడ్డులో వెళ్లాంటేనే తుప్పలు, బురదమయంగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెదజగ్గంపేట శ్మశానవాటికకు వెళ్లే ఈ రోడ్డుకు రూ.15 లక్షల వరకు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడంతో శ్మశానవాటికకు వెళ్లడానికి ఎదురయ్యే కష్టాలు గట్టెక్కాయని పెదజగ్గంపేట గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సోలాపురమ్మ ఆలయ అభివృద్ధి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

చోడవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు గాంధీగ్రామం పరిధిలోని సోలాపురి అమ్మవారి ఆలయ అభివృద్ధి సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. సంఘం గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ గాడి అప్పారావు, కోలా రమణ, రావాడ సూరిబాబు, కాకర నాగేశ్వరరావు. అధ్యక్షుడిగా దండ గోవింద్, ఉపాధ్యక్షులుగా మల్లారి సుధాకర్, కార్యదర్శిగా అడ్డూరు గోపి, సహాయ కార్యదర్శిగా కొసర తాతారావు, కోశాధికారిగా గొర్లె సింహాచలం నాయుడు, చింత శంకర్, కాకర త్రినాథ్‌లు నియమితులయ్యారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు.

జనసేన బలోపేతానికి కృషి



గోపీనాగేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కె.కోటపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపి నాగేశ్వరరావు చెప్పారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి, కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానన్నారు. అంతకుముందు జనసేన మాడుగుల నియోజకజవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ప్రకటించిన మేరకు అధ్యక్షుడిగా గోపి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సూరిశెట్టి ఉమామహేశ్వరరావులను కూటమి నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి అప్పారావు, సహదేవుడు, బాలకృష్ణ, గణేశ్, రాజేశ్, వెంకట్, కోటయ్య, రాకేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు జడ్పీటీసీపై పోలీసులకు ఫిర్యాదు

పంటలను అనుచరులతో ధ్వంసం చేయించారని ఆదివాసీల ఆందోళన



రోలుగుంట పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

రోలుగుంట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పంటలను కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు తన అనుచరులతో సోమవారం చొరబడి ధ్వంసం చేశారని పోలీసులకు ఆదివాసీలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బుగ బంగారావు మాట్లాడుతూ ఎంకేపట్నం రెవెన్యూలోని చటర్జీపురంలో పి ఎకరాల మెట్టు భూమిని ఆదివాసీలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారని, వారి సాగుబడిని రికార్డుల్లో కూడా రెవెన్యూ అధికారులు నమోదు చేశారని చెప్పారు. 2021లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన ఎం.రామిరెడ్డి ఈ భూములను కొనుగోలు చేసినట్టు చెబుతూ ఆదివాసీలను తొలగించానికి ప్రయత్నాలు చేశారని, దానికి మద్దతుగా కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు ఆదివాసీలను ఇబ్బందులు పెడుతున్నారని, గతంలో ఇరు వర్గాలపై కేసు నమోదైందని, అప్పటి నుంచి నర్సీపట్నం సివిల్ కోర్టులో కేసు నడుస్తున్నదని చెప్పారు. ఈ కేసు విచారణలో ఉండగా నూకరాజు నాలుగు ఆటోల్లో 20 మందిని సోమవారం తీసుకువచ్చి గిరిజనులు సాగుచేసుకుంటున్న అరటి, జామ, ఇతర పంటలను ధ్వంసం చేశారన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పరిస్థితిని అదుపు చేసినట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

పాస్టర్ కేసులో న్యాయం జరగాలని ర్యాలీ

నాతవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ కేసులో న్యాయం జరగాలని కోరుతూ క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవ, మైనారిటీలపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. అనంతరం మెయిన్ రోడ్డులో క్రైస్తవులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంగారు సూరిబాబు, సంఘ సభ్యులు కె.త్రిమూర్తులు, సామర్ల రామారావు నాజర్, ప్రసాద్ గంగాధర్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి వాటర్ ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ ఆల యానికి ముమ్మిన సత్యారావు, మమతలక్ష్మి కుటుంబ సభ్యులు సుమారు రూ.90 వేల విలువైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. భక్తుల తాగునీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ని ఏర్పాటు చేసిన దాతలను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, వరప్రసాద్, రమణబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేయాలి

చీడికాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో సర్వే నంబరు 90లోని గ్రామకంఠంలో అక్రమంగా నిర్మిస్తున్న పక్కా గృహాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పిటి.బాబు, ఎంపీటీసీ సభ్యుడు పీళ్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు చీడికాడ పోలీసులు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2015-16లో అదే గ్రామానికి చెందిన మురుకుర్తి శ్రీను కుటుంబం గ్రామకంఠం స్థలంలో ప్రభుత్వ సెలవులు ఉన్న సమయంలో శ్లాబ్‌లెవెల్ వరకూ నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. అప్పట్లో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గ్రామ పంచాయతీ పాలకవర్గం అడ్డుకున్నారన్నారు. ఇరువర్గాల వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇంతవరకూ నిర్మాణాన్ని నిలుపుదల చేశారన్నారు. దీనిపై ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ పట్నాల గోపిని, పంచాయతీ కార్యదర్శి నాయుడును వివరణ కోరగా, ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేసి ఎవరిది అనేది తేల్చుతామని వారు తెలిపారు.

నేడు లింగంపేటలో జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు

కృష్ణాదేవిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ జాతరలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహింస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరవాలని కోరారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు బహుమతులు, రవాణా చార్జీలు ఇవ్వనున్నట్టు వారు చెప్పారు.

వడ్డాదిలో నవరాత్రి ఉత్సవాలు



పూజలు అందుకుంటున్న ఉత్సవమూర్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వడ్డాది పంచాయతీ కార్యాలయం ఎదుట సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అర్చకుడు ఎన్.కృష్ణశర్మ ఆధ్వ ర్యంలో సీతారాములకు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, విష్ణుసహస్ర సర్వదేవత పారాయణం నిర్వహిస్తున్నారు. సోమవారం సీతారాములకు భక్తులు ఎలిశెట్టి ఈశ్వరరావు అమ్మాజీ దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. శ్రీరామ నవమి వరకూ పూజలు కొనసాగుతాయని, ప్రతి రోజూ భక్తులతో నూతన వస్త్రాలంకరణ, నక్షత్ర హారతి నిర్వహిస్తామని అర్చకుడు కృష్ణశర్మ తెలిపారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

కృష్ణాదేవిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ జాతర సందర్భంగా సోమవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, కార్యదర్శి అల్లాడ సురేశ్, నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి, జనసేన, టీడీపీ నాయకులు దొరబాబు, సలాదుల ప్రసాద్, రేగుబల్ల శివ, నారాయణరావు, చిరంజీవి పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, అమరావతి దంపతులు డప్పు కార్మికులకు, గరగలను ఊరేగించి భక్తులకు నూతన దుస్తులు అందించారు.

రుణాలకు 514 దరఖాస్తులు

రోలుగుంట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఓసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి 24 పంచాయతీల నుంచి 514 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. మండలానికి స్వయం ఉపాధి నిమిత్తం 33 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ వారంలోనే బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని ఎంపీడీవో వివరించారు.

కార్యదర్శి లింగన్నకు సత్కారం

దేవరాపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ కార్యదర్శి లెక్కల లింగన్నను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యంను సోమవారం సత్కరించారు. సర్పంచ్ మతల దేముడమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లింగన్న సేవలను కొనియాడారు. వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, బొడ్డులక్ష్మి, గందం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పార్టుల చోరీ

రావికమతం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గర్నికంలో మెకానిక్ షెడ్డు వద్ద ఉన్న ట్రాక్టర్ పార్టులను ఆదివారం రాత్రి చోరీ చేసినట్టు మెకానిక్ అల్లు రామచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ ఇంజన్‌కు ఉన్న వెనుక పార్టులను దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ రెండు దఫాలు ఒక ట్రాక్టరు తొట్టి, నాగలిసెట్‌ను దొంగలు అపహరించుకుపోయారని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు.

వడ్డాదిలో పది చేతి బోర్లు

బుచ్చెయ్యపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు ఏర్పాటు చేస్తున్నామని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తెలిపారు. వడ్డాదిలో తాగునీటి బోర్లు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ గ్రాంట్ నుంచి పది బోర్లు మంజూరయ్యాయన్నారు. కాలనీ వాసులకు అందరికీ ఉపయోగపడేలా బోర్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డీఎల్.నారాయణమూర్తి, సర్పంచులు విజయ్‌కుమార్, వరకృష్ణ, ఎన్.రామునాయుడు, సిహెచ్.శంకరరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత

గొలుగొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి, జూనియర్ అసిస్టెంట్, ఈవోపీఆర్‌డీ, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఏడాదికాలంగా భర్తీచేయకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్‌లో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్‌లు మాత్రమే పనిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ ఖాళీల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు వేడుకున్నారు.